సాక్షి
అన్నమయ్య జిల్లా

బుధవారం ၊ 4 ၊ డిసెంబర్ ၊ 2024



పింఛాకు జలకళ

పింఛా డ్యాంకు నెమ్మదిగా వరదనీరు వచ్చి చేరుతోంది. ఆదివారం సాయంత్రం 4గంటలకు 558 క్యూసెక్కులు వచ్చింది. డ్యాంలో నీటి నిల్వ పెరుగుతోంది. -8లో



మొరాయించిన 108 వాహనం

108 వాహనానికి జబ్బు చేసింది. కూటమి ప్రభుత్వంలో 108 అంబులెన్స్‌లకు కనీస మరమ్మతులు కరువవడంతో కదల్లేమంటూ మొండికేస్తున్నాయి. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.380	రూ.460
రెండోరకం	రూ.300	రూ.376



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 97 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	515	515
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 86.44 కిలోలు

న్యూస్‌రీల్

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసులు

నందలూరు(రాజంపేట): జాతీయస్థాయి రగ్బీ పోటీలకు టంగుటూరు జెడ్పీహైస్కూల్ విద్యార్థి జి.దిలీప్‌కుమార్ ఎంపికయ్యాడు. ఈమేరకు హెచ్‌ఎం శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 29, 30 తేదిలలో గుంటూరులో జరిగిన రగ్బీ అండర్–17 రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభను కనపరచాడు. దీంతో స్టాండ్‌బై నంబర్ వన్‌గా ఎంపికయ్యాడు. ఈనెల 25న పాట్నాలో జరిగే జాతీయస్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటారని పీడీ గణేష్‌బాబు తెలిపారు. దిలీప్‌ను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చాంద్, మస్తానయ్య, రమేష్‌బాబు, లక్ష్మీనారాయణరెడ్డి, మోహన్‌రాజు, లక్ష్మీదేవి, శశికళ, రజని, నాగార్జున, బాదుల్లాలు పాల్గొన్నారు.

టెన్నిస్ పోటీల్లో ప్రతిభ



జాతీయస్థాయిలో రాణించిన వైద్యులు రవికుమార్, వెంకటేశ్వర్‌రెడ్డి

మదనపల్లె: ఇండియన్ మెడికల్ టెన్నిస్ సొసైటీ(ఐఎంటీఎస్) ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో నిర్వహించిన టెన్నిస్ క్రీడాపోటీల్లో మదనపల్లె వైద్యులు డాక్టర్.రవికుమార్, డాక్టర్.వెంకటేశ్వర్‌రెడ్డి ప్రతిభ కనపరిచారు.గుజరాత్ అహ్మదాబాద్ రాకెట్ అకాడమీ స్టేడియంలో నవంబర్ 29, 30, డిసెంబర్ 1న మూడురోజులపాటు జరిగిన పోటీల్లో 60 సంవత్సరాల విభాగంలో మెన్స్ డబుల్స్‌లో మూడోస్థానంతో కాంస్య పతకాన్ని పొందారు. ఈ సందర్భంగా... జాతీయ టెన్నిస్ కోచ్ మలిగ భాస్కరనాయుడు, ఇండియన్ యూనియన్ క్లబ్ అధ్యక్షుడు రాటకొండ బాబు రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్.ఎల్.వి.రమణారెడ్డి, ఐయూసీ, ఐఎంఏ సభ్యులు వైద్యులను అభినందించారు. వైద్యకళాశాలలో వీరికి సహచరులైన గుజరాత్ స్టేట్ ఎలక్షన్ కమిషనర్ డాక్టర్.మురళి,ఐఏఎస్, ఇద్దరు వైద్యులను సత్కరించారు.

ఆర్‌జేడీ బాధ్యతల స్వీకరణ



దేవిడ్‌కుమార్ స్వామి

వైవీయూ: కళాశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులుగా దేవిడ్‌కుమార్ స్వామి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. కడప నగరంలోని కళాశాల విద్య ఆర్‌జేడీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. కళాశాల విద్య కమిషనరేట్‌లో జాయింట్ డైరెక్టర్‌గా పని చేస్తున్న ఈయనను రెగ్యులర్ ఆర్‌జేడీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బాధ్యతలు చేపట్టిన ఆర్‌జేడీని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ జి.రవీంద్రనాథ్, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.సలీంబాషా, అధ్యాపకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాగా ఏడాది కాలంలో ముగ్గురు ఆర్‌జేడీలు మారగా, తాజాగా రెగ్యులర్ ఆర్‌జేడీగా ఈయన బాధ్యతలు చేపట్టడం గమనార్హం.

పంటల బీమా సద్వినియోగం చేసుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న డీఏఓ చంద్రానాయక్

కేవీపల్లె: రైతులు పంటల బీమా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ)చంద్రానాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని గర్నిమిట్ట పంచాయతీ మల్లారపువాండ్లపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డీఏవో మాట్లాడుతూ రబీలో పంటలు సాగు చేసినరైతులు వేరుశనగకు ఎకరాకు రూ. 96, వరికి రూ. 126, టమాటకు రూ. 1600 ప్రీమియం చెల్లించి బీమా చేసుకోవాలని కోరారు. అలాగే పంటలు సాగు చేసిన రైతులు విధిగా ఇ-పంట నమోదు చేసుకోవాలన్నారు. వేరుశనగ సాగు చేసే రైతులు ఒక ఎకరాకు 200 కేజీలు చొప్పున జిప్సం వేయడం ద్వారా నాణ్యమైన దిగుబడి వస్తుందని తెలిపారు. వరిపంటకు పొటాష్ వాడితే రోగ నిరోధక శక్తి లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ వైవీ రమణ, ఏవోలు శ్రావణి, మోహన్, కరుణాకర్, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త మంజుల, పీరూనాయక్, వ్యవసాయ విస్తరణాధికారులు అనితాదేవి, ఇంద్రసేనారెడ్డి, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

సతమతం!

- జిల్లాలో పలువురు అధికారులకు వేధింపులు
- కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తప్పని ఇబ్బందులు
- ఎమ్మెల్యే భయపెడుతున్నారంటూ చంద్రబాబు, లోకేష్‌లకు తహసీల్దార్ మొర
- తలా ఒక మాట చెబుతున్న నేతలు... చేయలేక అల్లాడుతున్న యంత్రాంగం



సాక్షి రాయచోటి: సార్వత్రిక ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నేతల దృష్టంతా ఆర్థికంగా వెనకేసుకోవడంపైనే కేంద్రీకృతమైంది.అడ్డంగానో.. బలంగానో.. బలవంతంగానో... పనులు చేయించుకునేందుకు అధికారంతో పెత్తనం చెలాయిస్తున్నారు. ఇది కాదు..అది కాదు...ఇంకొకటి కాదు అన్నా సరే...గొంతుమీద కత్తి పెడుతున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ చేయాల్సిందేనని నయానో, భయానో వాదిస్తున్నారు. అంతేకాకుండా మాట వినని అధికారులపై పచ్చ పత్రికల ద్వారా విషం చిమ్ముతున్నారు. అధికారులను గుప్పెట్లో పెట్టుకునేందుకు ఎంతదాకైనా బరి తెగిస్తున్నారు. కూటమి పార్టీలో ఉన్న వర్గాలతో అధికారులు సతమతమవుతున్నారు. ఒకే పార్టీలో అనేక వర్గాలు ఉండడంతో...ఒకరు చేయమంటారు...మరొకరు వద్దంటారు...ఇలాంటి పరిస్థితిలో ఏమి చేయాలో పాలుపోక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. భూముల వ్యవహారానికి సంబంధించి తీవ్ర ఒత్తిడి చేస్తున్నారని ఇటీవల మదనపల్లె తహసీల్దార్ ఖాజాబీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషపై మంత్రి లోకేష్‌కు ఫిర్యాదు చేయడం కలకలం సృష్టించింది.

అధికారులపై పెరుగుతున్న ఒత్తిడి

జిల్లాలో పనిచేస్తున్న పలువురు అధికారులపై తీవ్ర ఒత్తిడి కనిపిస్తోంది. సార్వత్రిక ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్‌లోని నేతలు పనుల కోసం అధికారులను భయపెడుతున్నారు. కూటమిలోనే టీడీపీ, బీజేపీ, జనసేనలు ఉండగా... ఇది కాదన్నట్లు టీడీపీలోనే ఉన్న వర్గ విభేధాలతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఒక్క రెవెన్యూశాఖలోనే కాకుండా మంగంపేట మైనింగ్‌కు సంబంధించిన కీలక అధికారులపై కూడా వేధింపులకు పాల్పడతున్నారు. అక్కడ బెరైటీస్‌కు సంబంధించిన వ్యవహారంతోపాటు చిన్నపాటి ఉద్యోగులను తొలగించడం మొదలు కొత్త వారిని వేసుకోవాలని సిఫార్సులు చేస్తున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా రైల్వేకోడూరు నియోజకవర్గంలో టీడీపీలోనే మూడు వర్గాలు కొనసాగుతుండగా, జనసేనతోపాటు నామినేటెడ్ పదవి దక్కించుకున్న రూపానందరెడ్డి కుటుంబీకులు ప్రత్యేకంగా తమ ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇక్కడ ఎవరికి వారు చేస్తున్న ఒత్తిళ్లతో నియోజకవర్గంలో పోలీసుశాఖతోపాటు రెవెన్యూ, ఇతర అన్ని కీలక శాఖల్లోని అధికారులు ఎందుకొచ్చాం ఇక్కడికీ అనే పరిస్థితి కనిపిస్తోంది. ఇసుక, మైనింగ్, పశుసంవర్ధకశాఖ, అబ్కారీ, ఉపాధి హామి, పంచాయతీరాజ్ ఇలా చెబుతూపోతే అనేక శాఖల్లోనూ పనిచేస్తున్న అధికారులపై కూటమి నేతలు ఒత్తిడి, వేధింపులతో తమ మాట నిలబట్టుకునేందుకు తంటాలు పడుతున్నారు. రాజంపేటలోనూ టీడీపీలో ఉన్న రెండు వర్గాలతో అధికారుల పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా మారింది. ఒక వైపు రాజంపేట టీడీపీ నుంచి పోటీచేసిన సుగవాసి బాలసుబ్రమణ్యం, మరోవైపు జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజుల మధ్య అధికారులు పనులు చేయలేక అల్లాడి పోతున్నారు. రాయచోటి నియోజకవర్గంలో కూడా పరిస్థితి ఇలాగే కొనసాగుతోంది. తంబళ్లపల్లెలో కూడా టీడీపీ తరుపున పోటీ చేసిన జయచంద్రారెడ్డికి వ్యతిరేకంగా వర్గాలు ఉండడంతో అధికారులు ఏ పనిచేయాలన్న విసిగిపోతున్నారు. ఇటీవల పోలీసుశాఖకు సంబంధించి ఓ పంచాయతీ చేయాలని ఒక వర్గం...వద్దని మరో వర్గం పోటీ పడడంతో అక్కడ కూడా పలువురు పోలీసు ఉన్నతాధికారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలలలోపే అన్నిచోట్ల ఇలా అధికారులపై తలకుమించిన ఒత్తిడి పెరుగుతుండడంతో వారు కూడా లోలోన మదనపడుతున్నారు.

ఎమ్మెల్యే ఒత్తిడి భరించలేక..మంత్రికే వివరించిన తహసీల్దార్

మదనపల్లెలో ప్రస్తుతం భూముల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి.ఈ ప్రాంతంలో ఎక్కడా భూమికి సంబంధించిన మ్యుటేషన్, ఇతర ఎలాంటి వ్యవహారాలైనా తనకు తెలియకుండా చేయవద్దని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా వేధిస్తున్నారని తహసీల్దార్ ఖాజాబీ మంత్రి నారా లోకేష్‌కు ఫిర్యాదు చేయడం కలకలం సృష్టించింది. కార్యాలయ పరిధిలో భూములు, ఇతరత్రా ఎలాంటి పనులు చేయాలన్న తమకు తెలియకుండా చేయవద్దని ఎమ్మెల్యేతోపాటు అనుచరులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని తహసీల్దార్ చేసిన వినతి జిల్లాలో సంచలనంగా మారింది. ఒక్క మదనపల్లె తహసీల్దారే కాకుండా జిల్లాలో పనిచేస్తున్న చాలామంది తహసీల్దార్ల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. బయటికి చెప్పుకోలేక...తలకు మించిన పనులు చేయలేక అవస్థలు పడుతున్నారు. అధికార పార్టీలోని కీలక నేతలే తహసీల్దార్లపై తీవ్ర స్థాయిలో ఒత్తిళ్లు తెస్తున్నారు. ఇటీవల రాయచోటి నియోజకవర్గంలో చెప్పిన పనులు చేయలేదన్న నెపంతో ఒక రెవెన్యూ అధికారిని కేవలం రెండు, మూడు నెలల్లోనే బదిలీ చేశారు.

డిగ్రీ పరీక్ష పేపర్ లీక్



రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాల

రాయచోటి టౌన్: యోగివేమన విద్యాలయం పరిధిలోని రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న డిగ్రీ మూడో సెమిస్టర్ పబ్లిక్ పరీక్షల ప్రశ్నాపత్రం లీక్ అయినట్లు ఆరోపణలు వచ్చాయి. మంగళవారం సంస్కృత భాష పరీక్ష నిర్వహించాల్సి ఉంది. ఈ క్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ హర్షలత పంకజ్ పనిమీద అనంతపురం జిల్లాకు వెళ్లినట్లు సమాచారం. ఆమె మెయిల్‌కు వచ్చిన ప్రశ్నాపత్రాన్ని తాను సెలవులో ఉండటంతో తమ సిబ్బందితో కలిసి ఉన్న వాట్సాప్ గ్రూప్‌లో పోస్ట్ చేసింది. వాట్సాప్‌లో వచ్చిన పేపర్‌ను గ్రూప్‌లో ఉన్న ఒకరు బయటికి లీక్ చేయడంతో అది కాస్త చెక్కర్లు కొట్టి మీడియ వద్దకు చేరింది. ఈ విషయం తెలియడంతో అప్రమత్తమైన ప్రిన్సి పల్ మరో పది..పదిహేను నిమిషాలలో డిలీట్ చేసింది. ఈ విషయమై ప్రిన్సిపల్‌ను వివరణ కోరేందుకు ఫోన్ ద్వారా ప్రయత్నించగా.. అందుబాటులోకి రాలేదు.

పరీక్ష రద్దు

వైవీయూ: యోగివేమన విద్యాలయ పరిధిలో మంగళవారం నిర్వహించిన సంస్కృతం పరీక్షను రద్దు చేసినట్లు వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి తెలిపారు. రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రంలో పరీక్షా సమయంలో ప్రశ్నాపత్రం బయటకు వచ్చిందని వదంతులు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. విషయం తెలియగానే పరీక్షల నియంత్రణ అధికారిని ఆచార్య కె.ఎస్.వి.కృష్ణారావును పరీక్ష కేంద్రానికి పంపి స్వీయ పరిశీలన చేయించామన్నారు. కమిటీని ఏర్పాటు చేసి విచారణ చేయించి నిర్లక్ష్యానికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అన్నమయ్య జిల్లా పరిధిలో ఒక విద్యార్థి, వైఎస్సార్ జిల్లాలో 99 మంది విద్యార్థులు రాసే ఈ పరీక్ష మళ్లీ నిర్వహిస్తామన్నారు. పరీక్ష తేదీ ఎప్పుడన్నది తర్వాత తెలియజేస్తామన్నారు. పరీక్షల విధుల్లో ఉన్నవారు నిత్యం అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు.

ఇ- ప్రగతి స్థానంలో పరివాహన్ సేవలు

జిల్లా రోడ్డు భద్రత శాఖాధికారి కె.ప్రసాద్



రాయచోటి టౌన్ : ప్రగతి సేవ (ఆన్‌లైన్) దరఖాస్తులను తొలిగించి వాటి స్థానంలో అందుబాటులోకి వచ్చిన పరివాహన్ సేవ దరఖాస్తుల ద్వారానే లైసెన్స్‌ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని అన్నమయ్య జిల్లా రోడ్డు భద్రత శాఖాధికారి కె.ప్రసాద్ తెలిపారు. మంగళవారం రాయచోటి రవాణాశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త ఆన్‌లైన్ సిస్టం ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆర్టీవో చెప్పారు. వాటి పరిశీలన కోసం ముగ్గురిని సహాయకులుగా నియమించామన్నారు .

పన్నుల వసూళ్లు

ప్రభుత్వం నిర్దేశించిన పన్ను వసూళ్లలో 91శాతం పూర్తి చేశామన్నారు. ప్రభుత్వం రూ.87లక్షలు టార్గెట్ ఇస్తే అందులో రూ.79లక్షలు వసూలు చేశామన్నారు. పన్నుల వసూళ్లలో మదనపల్లె ఎంవీఐ దినేష్ చంద్ర, రాజంపేట ఎంవీఐ వినోద్‌కుమార్, రాయచోటి ఎంవీఐ అరుణ్ కుమార్‌లు ముందంజలో ఉన్నారని తెలిపారు. ఈ నెల నుంచి జిల్లా రోడ్డు సేఫ్టీ ఏజెన్సీ అనే కమిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమీపంలో ఎక్కడైనా ప్రమాదం జరిగితే ఈ బృందం వెంటనే ఆ ప్రదేశానికి వెళ్లి చికిత్స అందిస్తారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 64 బ్లాక్ స్పాట్స్ గుర్తించామని అక్కడ ప్రమాదాల నివారణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. పేపర్ స్థానంలో డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇకపై కార్డు రూపంలో ఇచ్చే ప్రక్రియ జరుగుతోందన్నారు. కార్డు కోసం దరఖాస్తుదారుడి నుంచి రూ.200లు స్వీకరించనున్నట్లు చెప్పారు.

జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

అధికారులకు కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ ఆదేశం

రాయచోటి: జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రభుత్వ శాఖలన్నీ పటిష్టమైన ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో త్వరలో ముఖ్యమంత్రి నిర్వహించనున్న జిల్లా కలెక్టర్ల సమావేశానికి సంబంధించిన ప్రాధాన్యతలు, చేపట్టాల్సిన చర్యలపై ఆయా శాఖలు సమర్పించిన నివేదికలపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా ఇండికేటర్లను సమీక్షించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, సీపీఓ వెంకట పెద్దయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలి

ఈనెల 6వ తేదీ నుంచి జిల్లాలో నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీసీ హాల్ నుండి సబ్ కలెక్టర్లు, ఆర్డీఓ, మండల తహసీల్దార్లతో రెవెన్యూ సదస్సులు, సర్వే రాళ్లపై బొమ్మల తొలగింపు, ముఖ్యమంత్రి కార్యాలయ నుంచి వచ్చిన అర్జీలు, పీజీఆర్‌ఎస్ అర్జీలు, నీటి పన్నుకు సంబంధించిన డేటా తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈనెల నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సుల నిర్వహణకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఏ తేదిలలో ఏ గ్రామంలో రెవెన్యూ సదస్సును నిర్వహించబోతున్నారో ముందుగా ప్రకటనల ద్వారా ప్రజలందరికీ తెలిసేలా ప్రచారం చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. .

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటి: మట్కా, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ తదితర అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం అన్నమయ్య జిల్లా రాయచోటి పోలీసు ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎస్పీ అధ్యక్షతన నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు సమావేశంలో పాల్గొన్నారు. పోలీసు శాఖ పట్ల ప్రజల్లో విశ్వసనీయత పెంచేలా విధులు నిర్వర్తించాలని ఎస్పీ సూచించారు. బహిరంగ మద్యపానంపై ముమ్మరంగా తనిఖీలు చేపట్టి కేసులు నమోదు చేయాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా గ్రామాలు సందర్శిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్, హత్య కేసులలో పురోగతిని అడిగి తెలుసుకున్నారు. చోరీ కేసుల్లో సొత్తును త్వరితగతిన రికవరీ చేసి బాధితులకు అప్పజెప్పాలన్నారు. అనుమానాస్పద మృతులు, సైబర్‌నేరాలు, పోక్సో, మహిళలపై నేరాల కేసులలో విచారణ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. గంజాయి, ఎస్సీ, ఎస్టీ కేసుల గురించి రాయచోటి, మదనపల్లి, రాజంపేట సబ్ డివిజన్ల వారీగా ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. గంజాయి, నిషేధిత మత్తు పదార్థాలు రవాణా, విక్రయించే వారిపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. సైబర్‌నేరాల బారిన పడ్డ బాధితులకు న్యాయం చేయాలని, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను, చట్టపరమైన చర్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకోవాలి

ఎర్రచందనం అక్రమరవాణాను అడ్డుకోవాలని ఎస్పీ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పరిధిలో శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం తరలిపోకుండా గట్టి నిఘాను పెంచాలన్నారు. ఈ విషయంపై పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఎర్రచందనం కేసులలో పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్‌లను త్వరితగతిన అమలు చేయాలని ఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎం.వెంకటాద్రి, రాయచోటి, మదనపల్లి, రాజంపేట సబ్ డివిజన్ పోలీసు అధికారులు ఎంఆర్ కృష్ణమోహన్, డి.కొండయ్యనాయుడు, ఎస్.సుధాకర్, జిల్లాలోని సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

రైల్వేలో గుర్తింపు పోరు

- పోటాపోటీగా ఎన్నికల ప్రచారం
- 4,5,6న పోలింగ్‌కు సన్నాహాలు





దక్షిణమధ్యరైల్వే ఎంప్లాయీస్ సంఘ్ బ్రాంచి కార్యాలయం

రాజంపేట: రైల్వేలో కార్మికుల గుర్తింపు ఎన్నికల పోరు తారస్థాయికి చేరుకుంది. రైల్వే యాజమాన్యం పోలింగ్‌కు సర్వం సిద్ధం చేస్తోంది.ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని వివిధ ప్రధాన రైల్వే స్టేషన్లలోని బ్రాంచి ప్రతినిధులు తమ పరిధిలోని కేంద్రాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈనెల 4, 5 తేదీల్లో జరిగే ఎన్నికల్లో తమ అభ్యర్థులను గెలపించాలని కార్మికులు, ఉద్యోగులకు విన్నవిస్తున్నారు. ఎన్నికల్లో 30శాతం ఓట్లు సాధించిన కార్మిక సంఘాలను క్రమసంఖ్య ఆధారంగా గుర్తింపు సంఘాలుగా గుర్తించి ప్రాతినిధ్యం కల్పిస్తారు. ఎన్నికల ప్రచారపర్వం సోమవారం ముగిసింది.

పోటీపడుతున్న యూనియన్లు

ఈ ఎన్నికల్లో ప్రధానంగా దక్షిణమధ్య రైల్వే మజ్దూర్ యూనియన్, దక్షిణమధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ తలపడుతున్నాయి. అలాగే దక్షిణ మధ్య రైల్వేకార్మిక సంఘ్(డీఎంఆర్‌కేఎస్), ఇండియన్ రైల్వే మజ్దూర్ యూనియన్ (ఆర్‌ఎంయూ), రైల్ మజ్దూర్ యూనియన్ (ఆర్‌ఎంయూ)లు ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయి.

2019లో జరగాల్సి ఉండగా...


2013 ఏప్రిల్ మాసంలో భారతీయ రైల్వేలో గుర్తింపు కార్మికసంఘాల ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో సౌత్‌సెంట్రల్ మజ్దూర్ యూనియన్ విజయం సాధించిన సంగతి విధితమే. 2019లో ఎన్నికలు జరగాల్సి ఉండగా..కోవిడ్ కారణంతో రైల్వే యాజమాన్యం వాయిదా వేస్తూ వచ్చింది.

ఓటర్ల వివరాలు

నందలూరు:	391
కడప:	320
కోడూరు:	298
ఎర్రగుంట్ల:	410
కొండాపురం:	280
ప్రొద్దుటూరు:	270

సీక్రెట్‌బ్యాలెట్ ద్వారా...

రైల్వే గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో సీక్రెట్ బ్యాలెట్ ద్వారా పోలింగ్ నిర్వహించనున్నారు. గతంలో జరిగిన ఎన్నికలు కూడా ఇదే పద్ధతిలో నిర్వహించారు. నందలూరు, కోడూరు, కడప, ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, కొండాపురంలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేయనున్నారు. వీటి పరిధిలో ఉన్న రైల్వే ఉద్యోగులు, కార్మికులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంటుంది. ఈ ఎన్నికలను రెండు కార్మిక సంఘాలు ప్రతిష్టాతక్మంగా తీసుకోనున్నాయి.



వివిధ సంఘాల మేనిఫెస్టోలోని ప్రధానాంశాలు

- ఉద్యోగులందరికీ రిస్క్–హార్డ్ డ్యూటీ అలవెన్స్
- ట్రాక్ మెయింటెయినర్లకు రిస్క్ అలవెన్స్ పెంపు
- ఉద్యోగులందరికి టూవీలర్ భత్యం
- ఉద్యోగుల పిల్లలకు పోస్టు గ్రాడ్యుయేషన్ వరకు విద్యాభత్యం చెల్లింపు
- అన్ని రకాల క్వార్టర్స్‌లో ఏసీలు బిగించేందుకు ఏర్పాట్లు
- ఉద్యోగుల తల్లిదండ్రులకు రైల్వేపాస్, వైద్య సదుపాయం కల్పించడం
- 70 శాతం రన్నింగ్ అలవెన్స్ ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు
- పీఎల్‌బీ బోనస్ సీలింగ్ ఎత్తివేసి అసలు జీతంపై బోనస్ చెల్లింపు
- అన్ని కేటగిరిల్లో ఉద్యోగ ఖాళీలను సత్వరమే భర్తీ చేయించడం

ఏపీజీబీ కార్యాలయం తరలింపు ఆపాలి



మాట్లాడుతున్న సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ కన్వీనర్ రఘునాథరెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడప నుంచి అమరావతికి తరలించే యత్నాన్ని తక్షణమే ఆపాలని వివిధ సంఘాల నాయకులు ముక్తకంఠంతో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఏపీజీబీ యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ కన్వీనర్ రఘునాథరెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులురెడ్డి, మనోహర్, చంద్ర, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, మద్దిలేటి మాట్లాడారు. సంప్రదాయం ప్రకారం చూసినా, ఆర్థికశాఖ మార్గదర్శకాల తొలి ప్రాధాన్యత క్రమంగా చూసినా కార్యాలయం కడపలోనే కొనసాగించడం సముచితమన్నారు. వ్యాపారం, టెక్నాలజీ, ఆర్‌బీఐ అనుమతించిన చెస్ట్ సౌకర్యం, సొంత భవనాలు ఏపీజీబీకే మిగతా వాటి కంటే మిన్నగా ఉన్నాయన్నారు. రాయలసీమ లాంటి వెనుకబడిన ప్రాంతాల్లో ప్రధాన కార్యాలయం ఉంటేనే ప్రజలకు ఉప యుక్తంగా ఉంటుందన్నారు. ఈ ప్రాంత ప్రజాప్రతినిధుల విన్నపాలను కూడా రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. విలీనం తర్వాత ఏర్పడబోయే రాష్ట్ర స్థాయి గ్రామీణ ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

కువైట్‌లో పెద్దమండ్యం వాసి మృతి


అజాద్‌బేగ్(ఫైల్)

పెద్దమండ్యం : ఉపాధికోసం కువైట్‌కు వెళ్లిన ఓ వ్యక్తి పని ముగించుకుని రూముకు చేరుకోగా గుండెపోటుకు గురై మృతి చెందాడు. వివరాలలోకి వెళితే.. పెద్దమండ్యం గ్రామం పాతూరుకు చెందిన కాల్వగడ్డ అజాద్‌బేగ్ (49) కువైట్‌లో ఓ సేట్ వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కువైట్‌లో గత కొంత కాలంగా డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సోమవారం రాత్రి పని ముగించుకొని రూముకు రాగా గుండెపోటుకు గురై అతను మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం వచ్చింది. భార్య, పిల్లలు ములకలచెరువు మండలంలోని చౌడసముద్రంలో నివాసం ఉండగా, తల్లి, సోదరుడు పెద్దమండ్యం పాతూరులో నివసిస్తున్నారు. బతుకుదెరువు కోసం కువైట్‌కు వెళ్లిన వ్యక్తి గుండెపోటుతో మృతి చెందడంతో పెద్దమండ్యం పాతూరులో విషాదం నెలకొంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


అష్రఫ్ (ఫైల్)

కలికిరి (వాల్మీకిపురం) : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం అర్ధరాత్రి వాల్మీకిపురం మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు....కలికిరి పట్టణం మెయిన్ బజారుకు చెందిన పెయింట్స్ దుకాణం నిర్వాహకుడు అబ్దుల్ కుమారుడు అష్రఫ్(27) తన సొంత పని నిమిత్తం బెంగళూరుకు వెళ్లి తిరుగు ప్రయాణమయ్యాడు. అర్ధరాత్రి సుమారు 12.30 గంటలకు మండల పరిధిలోని టీఎం లోయ వద్ద కారు అదుపు తప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొన్నాడు. అష్రఫ్ వాహనంలో అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనదారులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వాల్మీకిపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ట్రాక్టర్, ఆటో ఢీకొని ఇద్దరికి గాయాలు

గుర్రంకొండ : ట్రాక్టర్, ఆటో ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన మండల కేంద్రమైన గుర్రంకొండలో జరిగింది. పోలీసుల కథనం మేరకు స్థానిక ఇందిరమ్మ కాలనీకి చెందిన ఎస్. రిజ్వాన్, ఫీజున్నిసాలు గత సోమవారం రాత్రి పట్టణంలోని ఓ ఆస్పత్రికి వెళ్లేందుకు తమ సొంత ఆటోలో బయలు దేరారు. ఇందిరమ్మ కాలనీ దాటుకొని ఎదురుమిట్ట వద్దకు చేరుకొగానే చెర్లోపల్లెకు వెళుతున్న ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో రిజ్వాన్, ఫీజున్నిసాలకు గాయాలయ్యాయి. గాయపడిన ఇరువురిని 108 వాహనంలో మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. జరిగిన సంఘటనపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధు రామచంద్రుడు తెలిపారు.

పింఛాకు జలకళ!

ఉమ్మడి వైఎస్సార్, చిత్తూరు జిల్లాల సరిహద్దు ప్రాంతమైన పింఛా సమీపంలో నిర్మించిన యర్రపురెడ్డి ఆదినారాయణరెడ్డి ప్రాజెక్టు గిరిజన ప్రాంతాలకు వరప్రసాదిని. ప్రాజెక్టు ఎగువ భాగంలో పడే వర్షపు నీరు ప్రాజెక్టులో చేరి దిగువ భాగంలో వేలాది మంది సాగుభూమికి నీరు అందిస్తుంది. దుస్థితిలో ఉన్న ఈ జలాశయానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహర్దశ కలిగింది. ఆ ఫలితంగానే నేడు డ్యాంలో నీటి నిల్వ చేసుకునే పరిస్థితి ఉంది.

- డ్యాం పునర్ నిర్మాణం తర్వాత తొలిసారిగా నీటి నిల్వ
- వైఎస్సార్‌సీపీ పాలనలో 95 శాతం పనులు పూర్తి
- క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి వస్తున్న వరద నీరు
- రూ.84.33 కోట్లు మంజూరు చేసిన వైఎస్సార్‌సీపీ సర్కారు


నీటితో కళకళలాడుతున్నత పింఛా డ్యాం

డ్యాం : పింఛా

ఇన్‌ఫ్లో	: 558 క్యూసెక్కులు
ప్రస్తుత లెవల్	: 989.20 ఎంఎఫ్‌టీ
సామర్థ్యం	: 0.14730 టీఎంసీలు
పర్సంటేజ్ ఆఫ్ వాటర్	: 44.9 శాతం
అవుట్ ఫ్లో	: నిల్

రాజంపేట : ఐదు దశాబ్దాలు పూర్తి చేసుకున్న పింఛా డ్యాం పునర్ నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మోక్షం కలిగింది. 2022 నవంబరు 2న డ్యాం పునర్ నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన చర్యలను తీసుకుంది. ఈ డ్యాం పునర్ నిర్మాణం కోసం అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూ.84.33 కోట్ల నిధులను మంజూరు చేశారు. రైట్‌మెయిన్ కెనాల్, హెడ్‌వర్క్స్, రింగ్‌బండ్ నిర్మాణ పనులను చేపట్టారు. అప్పటి నుంచి సార్వత్రిక ఎన్నికల ముందు నాటికి 95 శాతం పనులు పూర్తయ్యాయి. ఇప్పుడు వరదలు వస్తున్న క్రమంలో డ్యాంలో నీటి నిల్వకు అవకాశం కలిగింది. దీనికి కారణం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి అని ఆయకట్టుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పింఛా నిర్మాణ స్వరూపమిలా..

చెయ్యేరు(బహుదా, మాండవ్య, పింఛా) ఉపనదిపై పింఛా ప్రాజెక్టు నిర్మించారు. మొత్తం 3773.41 ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు రాజంపేట నియోజకవర్గం టి.సుండుపల్లె మండలంలోని ముడుంపాడు గ్రామ సమీపంలో ఈ ప్రాజెక్టు నిర్మితమైంది. 1954 సంవత్సరం అక్టోబర్ 1న నిర్మాణం ప్రారంభించి 1960 సంవత్సరం అక్టోబర్ 28న పూర్తిచేశారు. ఈ డ్యాంకు వై. ఆదినారాయణరెడ్డి పేరు పెట్టారు. పీలేరు, తలకోన ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో వరదనీరు డ్యాంలోకి వచ్చి చేరుతుంది.

ప్రయోజనం పొందే గ్రామాలు..

పింఛా జలాశయం వలన ముడుంపాడు, ఆరోగ్యపురం, కందులవారిపల్లె, నందనాయక్ బిడికి, వాయిలొడ్డు, మాచిరెడ్డిగారిపల్లె, శ్రీరాములురెడ్డిగారిపల్లె, కరువపల్లె, చెరుకువారిపల్లె, పెద్దినేనికాలువ, పల్లి ఈడిగిపల్లె, రాచపల్లె, రెడ్డివారిపల్లె, బెస్తపల్లె, రాయవరం ఉన్నాయి.

1960 నుంచి..

1960 నుంచి ప్రాజెక్టు అందుబాటులో ఉన్న నీటిలో 0.765 టీఎంసీ ఉపయోగించుకుంది. రిజ్వరాయర్ నిల్వ సామర్థ్యం 0.3276 టీఎంసీ (స్థూల), 0.3222 టీఎంసీ(నికరం). ప్రాజెక్టు వ్యయం రూ.0.60కోట్లు (ఎస్ఎస్ఆర్1954). ఏపీసీబీటీఎంసీ కార్యక్రమం కింద కాలువల ఆధునీకరణ చేపట్టి పనులు పూర్తిచేశారు. ఎఫ్‌టీఎల్ ప్లస్ 304.880మీ, ఎండబ్ల్యుఎల్ ప్లస్ 304.880మీ, టీబీఎల్ ప్లస్ 307.320మీ గా ఉంది. ఉచిత పరీవాహక ప్రాంతం 555.50 చ.కి.మీ, అడ్డగించిన ప్రాంతం 1108.50చ.కి.మీ, కంబైన్డ్ క్యాచ్‌మెంట్ ఏరియా 1664 ఎస్‌క్యూకెఎం, డెడ్‌స్టోరేజి 5.4 ఎంసీఎఫ్‌టీ, ప్రత్యక్ష నిల్వ 322.2 ఎంసీఎఫ్‌టీ కాగా మొత్తం నిల్వ 327.60 ఎంసీఎఫ్‌టీగా నిర్ణయించారు.

ప్రాజెక్టు నుంచి నీరు విడుదల

సుండుపల్లె : పింఛా ప్రాజెక్టు నిండి నీటితో కళకళలాడుతోంది. మంగళవారం 1072 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి రాగా 3779 క్యూసెక్కుల నీటిని బయటకు పంపిస్తున్నారు. ప్రస్తుతం 1000 అడుగుల నీరు 0.3276 టీఎంసీలుగా నిల్వ ఉందని ఏఈ నాగేంద్ర నాయక్ తెలిపారు.

పింఛా డ్యాంకు నెమ్మదిగా వరదనీరు



పింఛా డ్యాంకు నెమ్మదిగా వరదనీరు వచ్చి చేరుతోంది. ఆదివారం సాయంత్ర 4గంటలకు 558 క్యూసెక్కులు నీరు వచ్చింది. డ్యాంలో నీటి నిల్వ పెరుగుతోంది. డ్యాం నుంచి అవుట్‌ఫ్లో లేదు. డ్యాంకు ఉన్న ఆయకట్టుకు సాగు నీరు, తాగునీటి సౌకర్యం కలుగుతుంది. వరదనీటి అంచనాలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నాం.
– బుక్కే నాగేంద్రనాయక్, ఏఈఈ, పింఛాడ్యాం, సుండుపల్లె

రైతు భరోసా కేంద్రంలో విద్యుత్ పరికరాలు చోరీ


చోరీకి గురైన విద్యుత్ పరికరాలు

పుల్లంపేట : మండల కేంద్రమైన పుల్లంపేటలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రంలో రూ. 70 వేలు విలువజేసే విద్యుత్ వైర్లు, ఫ్యాన్లు, వివిధ విద్యుత్ పరికరాలను చోరీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్ర భవన నిర్మాణానికి రూ. 21,80,000లు నిధులు మంజూరు చేయగా వైఎస్సార్‌సీపీ నాయకుడు మడగం శ్రీనివాసులు భవన నిర్మాణం పూర్తి చేశారు. ఇటీవల మాజీ ఎమ్మెల్యే, స్థానిక నాయకులు ప్రారంభించారు. ఇప్పటికీ సుమారు రూ. 5 లక్షలు బిల్లు ఇంకా ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. కానీ మంగళవారం ఉదయం తలుపులకు వేసిన తాళాలు అలాగే ఉన్నాయి. కానీ తలుపులు లోపలకు వంగి ఉండటంతో అనుమానం వచ్చి చూడగా విద్యుత్ వైర్లు, ఫ్యాన్లు, విద్యుత్ పరికరాలు చోరీకి గురైనట్లు గుర్తించారు.

తప్పుడు కేసులు పెట్టిన వ్యక్తులపై రిట్ పిటిషన్

మదనపల్లె : అమ్మేసిన భూముల ధరలు పెరగడంతో, రిజిస్టర్ చేసి ఇచ్చిన ఆస్తులను ఫోర్జరీ సంతకాలతో కాజేశారని తమపై పెట్టిన కేసులు తప్పువని రుజువయ్యాయని, తప్పుడు కేసులు పెట్టిన వ్యక్తులపై హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయనున్నట్లు బాధితురాలు కోనేటి సులోచన తెలిపారు. మంగళవారం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ...పట్టణానికి చెందిన మార్వారి వెంకటేశ్వర్లు అలియాస్ మార్వారి వెంకటేష్ నాయుడు తన వద్ద డబ్బులు తీసుకుని అతని పేరుమీద ఉన్న ఆస్తిని పాకాల, పులివెందుల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రెండుసార్లుగా రిజిస్టర్ చేయించి ఇచ్చారన్నారు. కొంతకాలానికి భూముల ధరలు పెరగడంతో అత్యాశకు పోయి, రిజిస్టర్ డాక్యుమెంట్లలో తాను సంతకమే పెట్టలేదని, వేలిముద్రలు తనవి కావని, ఫోర్జరీ సంతకాలతో ఆస్తి కాజేశారని తనతో పాటు పాకాల, పులివెందుల సబ్ రిజిస్ట్రార్‌లపై కేసులు పెట్టారన్నారు. దీంతో తిరుపతి, కడప జిల్లాల రిజిస్ట్రార్‌లు, రాష్ట్ర స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ఐజీ తదితరులు దర్యాప్తు చేసి డాక్యుమెంట్లపై వేలిముద్రలు, సంతకం మార్వారి వెంకటేష్‌నాయుడుదేనని తేల్చారన్నారు. ప్రభుత్వ అధికారులపై తప్పుడు కేసులు పెట్టిన వెంకటేష్‌పై క్రిమినల్ కేసులకు అధికారులు ఆదేశించారన్నారు. దీంతో పాకాల సబ్‌రిజిస్ట్రార్ రహీముల్లా, పులివెందుల సబ్‌రిజిస్ట్రార్ చంద్రమోహన్‌లు మార్వారి వెంకటేష్‌నాయుడిపై వేర్వేరుగా వారి పరిధిలోని పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదు చేశారన్నారు. సమాజంలో గౌరవ మర్యాదలతో బతుకుతున్న తనపై కేసులు పెట్టి తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన మార్వారి వెంకటేష్‌నాయుడు, పార్వతమ్మ, వెంకటరమణారెడ్డి, రెడ్డిగోపాల్‌నాయుడు, సునీతల మీద హైకోర్టులో రిట్ పిటిషన్ వేయనున్నట్లు తెలిపారు.

కేరళ ప్రభుత్వంపై బీజేపీ వైఖరి సరికాదు


మాట్లాడుతున్న సీఐటీయూ, రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

రాయచోటి అర్బన్ : కేరళలోని వామపక్ష ప్రభుత్వం పట్ల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కక్షపూరిత విధానాలను విడనాడాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు పి.మణి డిమాండ్ చేశారు. మంగళవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేరళకు చట్టపరంగా అందాల్సిన నిధులను ఇవ్వకపోగా గవర్నర్‌ను అడ్డుపెట్టుకుని కేరళ అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను తొక్కిపెడుతుండడం దుర్మార్గమన్నారు. సుప్రీంకోర్టు జోక్యంతో రాష్ట్రానికి అరకొర నిధులు కేటాయిస్తున్నారన్నారు. కేరళలోని భారత పెట్రోలియం లాంటి భారీ పరిశ్రమను విక్రయించేందుకు బీజేపీ ప్రభుత్వం సిద్ధపడగా కేరళ ప్రజలు సంవత్సరం పాటు ఆందోళన చేస్తే కేంద్ర ప్రభుత్వం వెనక్కు తగ్గిందన్నారు. త్రివేండ్రం విమానాశ్రయాన్ని ప్రైవేటీకరణలో భాగంగా అదానీకి అప్పజెప్పారన్నారు. తీవ్ర వర్షాల కారణంగా వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడి 400 మంది మృతి చెంది, నాలుగు జిల్లాలు పూర్తిగా నీటమునిగితే కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం ఆదుకోకపోవడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వ కక్ష పూరిత విధానాలను నిరసిస్తూ ఈనెల 11న దేశవ్యాప్తంగా కేరళ సంఘీభావ దినంగా పాటిస్తున్నట్లు వారు తెలిపారు. సమావేశంలో రైతు సంఘం నాయకుడు నాగబసిరెడ్డి, రైతులు బషీర్ ఖాన్, అహమ్మద్, రెడ్డెయ్య పాల్గొన్నారు.

ఆస్తులు వక్ఫ్‌బోర్డ్‌వి అయితే ఇన్నేళ్లు ఏం చేశారు?

అంజుమన్-ఏ-హమ్‌దర్ద్-ఏ-ఇస్లాం కమిటీ సభ్యుల ధ్వజం


సమావేశంలో మాట్లాడుతున్న ట్రస్ట్ అధ్యక్షుడు ఎస్.ఏ.మస్తాన్, ట్రెజరర్ ఐనుల్లా తదితరులు

మదనపల్లె : అంజుమన్-ఏ-హమ్‌దర్ద్-ఏ-ఇస్లాం ట్రస్ట్ ఆస్తులు వక్ఫ్‌బోర్డువి అయితే 24 ఏళ్ల అధికారులు ఎందుకు స్వాధీనం చేసుకోలేదని ట్రస్ట్ అధ్యక్షుడు, టీడీపీ మైనారిటీ నాయకుడు ఎస్.ఏ.మస్తాన్, ట్రెజరర్ ఐనుల్లా ప్రశ్నించారు. సాక్షి దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన మైనారిటీ ఆస్తులపై పెద్దల కన్ను వార్తపై అంజుమన్-ఏ-హమ్‌దర్ద్-ఏ-ఇస్లాం ట్రస్ట్ సభ్యులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు ఎస్.ఏ.మస్తాన్ మాట్లాడుతూ అంజుమన్-ఏ- హమ్‌దర్ద్-ఏ-ఇస్లాం ట్రస్ట్ ముస్లిం సమాజానికి జవాబుదారీగా పనిచేస్తుందే తప్ప ప్రభుత్వానికి, వక్ఫ్‌బోర్డుకు జవాబుదారీ కాదన్నారు. ట్రస్ట్ తన పరిధిలో కార్యకలాపాలను చేసుకుంటూ వెళుతుంటే, వక్ఫ్‌బోర్డుకు చెందిన అధికారుల అనాలోచిత నిర్ణయాలతో గందరగోళం ఏర్పడిందన్నారు. జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్‌కు అనుభవం, అవగాహన లేకపోవడంతో ఎలాంటి నిబంధనలు పాటించకుండా ఆస్తులు స్వాధీనం చేసుకుంటున్నట్లు ప్రకటించేశారన్నారు. అంజుమన్-ఏ-హమ్‌దర్ద్-ఏ-ఇస్లాం-ట్రస్ట్ ఆస్తుల విషయాన్ని జిల్లా కలెక్టర్, వక్ఫ్‌బోర్డు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఎస్.జెడ్.నాసిర్ పాల్గొన్నారు.

ప్రొటోకాల్‌కు తూట్లు పొడుస్తున్నారు



మాట్లాడుతున్న జయరాణెమ్మ

వీరబల్లి : మండలంలో చేపడుతున్న సీసీరోడ్ల నిర్మాణ పనుల ప్రారంభోత్సవంలో అధికారపార్టీ నాయకులు, అధికారులు కలిసి ప్రొటోకాల్‌కు తూట్లు పొడుస్తున్నారని వైఎస్సార్‌సీపీకి చెందిన వీరబల్లి గ్రామ సర్పంచ్ గాలివీటి జయరాణెమ్మ విమర్శించారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గత వారం రోజుల నుంచి గ్రామీణ ప్రాంతాలలో సీసీ రోడ్ల నిర్మాణం పనులు చేపట్టారన్నారు. స్థానికంగా ఉండే సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీలను పిలవకుండా అధికార పార్టీ నాయకులే భూమి పూజలు చేసుకొని పనులు ప్రారంభిస్తున్నారన్నారు. సోమవారం మండలంలోని గడికోట, వీరబల్లి, తాటిగుంటపల్లి పంచాయతీలలో సీసీ రోడ్లకు భూమి పూజలు చేసి పనులు ప్రారంభించారన్నారు. ఇక్కడ కనీసం ప్రొటోకాల్ పాటించలేదన్నారు. కూటమి నాయకులు చెప్పినట్లు నడుచుకోవడం అధికారులకు ఎంతవరకు సమంజసమని ఆమె ప్రశ్నించారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు, పంచాయతీరాజ్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

నాటుసారా రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్టు

మదనపల్లె : మండలంలోని వలసపల్లె క్రాస్ వద్ద ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో ఆటోలో నాటుసారా రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ భీమలింగ తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... పుంగనూరుకు చెందిన ఎస్.నజీర్(30) ఆటోలో నాటుసారా రవాణా చేస్తుండగా, ఎక్సైజ్ అధికారులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారన్నారు. విచారణలో పుంగనూరు మండలం నల్లగుట్టపల్లె తండాకు చెందిన వాసునాయక్ సారా తయారీదారుడని, మదనపల్లె మండలం నక్కలదిన్నె బాబునాయక్ భార్య శ్రీలత అలియాస్ తులసికి సరుకును చేర్చేందుకు వెళుతున్నట్లు చెప్పాడన్నారు. దీంతో ఆటోలోని 96 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, ఆటోను సీజ్‌చేసి, నజీర్‌తో పాటు సారా తయారీదారుడు, విక్రేతలు ఇద్దరినీ కేసులో నిందితులుగా చేర్చామన్నారు. త్వరలోనే వారిని అరెస్ట్‌చేస్తామని తెలిపారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్‌ఐలు డార్కస్, హెడ్‌కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, నాగయ్య, కానిస్టేబుళ్లు నాగరాజు, మణి, మధు పాల్గొన్నారు.

వీఆర్‌ఏపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి


సిద్దవటం తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వీఆర్‌ఏలు

సిద్దవటం : వీఆర్‌ఏ కిషోర్‌పై దాడిచేసిన వారిని అరెస్టు చేయాలని సిద్దవటంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద మంగళవారం వీఆర్‌ఏలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర విలేకరులతో మాట్లాడుతూ లింగంపల్లె వీఆర్‌ఏగా పనిచేస్తున్న కిషోర్ విధినిర్వహణలో ఉండగా సోమవారం సాయంత్రం నిమ్మకాయల ఓబుల్‌రెడ్డి అతనిపై దాడిచేశాడన్నారు. దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటపతి, మండల వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

ఎస్పీ చొరవతో గల్ఫ్ నుంచి గాలివీడుకు చేరుకున్న బాధితురాలు


బాధితురాలు రమణమ్మ, భర్త ఆంజనేయులు

రాయచోటి : ఉపాధి కోసం సౌదీకి వెళ్లి అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న నీరుగుట్టు రమణమ్మ ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు చొరవతో సురక్షితంగా స్వదేశానికి చేరుకుంది. గాలివీడుకు చెందిన నీరుగుట్టు రమణమ్మ బతుకుదెరువు కోసం సౌదీ వెళ్లింది. ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నట్లు సేఠ్‌కు తెలిపినా ఇంటికి పంపకుండా వేధింపులకు గురి చేస్తున్నాడని భర్త నీరుగుట్టు ఆంజనేయులుకు సమాచారం అందింది. బాధితురాలి భర్త ఆంజనేయులు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీని కలిసి గల్ఫ్‌లో తన భార్య పడుతున్న ఇబ్బందులను తెలియజేసి ఇంటికి రప్పించాలని విజ్ఞప్తి చేశారు. వారి వినతిపై తక్షణం స్పందించిన జిల్లా ఎస్పీ సౌదీలో అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న బాధితురాలిని స్వదేశానికి రప్పించేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రయత్నాలు ఫలించడంతో సోమవారం ఉదయం సురక్షితంగా స్వదేశానికి చేరుకున్నట్లు ఎస్పీ ఆఫీసు నుంచి సమాచారం అందింది. సోమవారం స్వగ్రామానికి చేరుకున్న బాధితురాలు రమణమ్మ భర్తతో కలిసి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

మొరాయించిన 108 వాహనం


108 వాహనాన్ని నెట్టుతున్న రోగుల సహాయకులు

మదనపల్లె : జబ్బు చేసిన వారిని ఆస్పత్రులకు చేర్చే 108 వాహనానికి జబ్బు చేసింది. కూటమి ప్రభుత్వంలో 108 అంబులెన్స్‌లకు కనీస మరమ్మతులు కరువవడంతో కదల్లేమంటూ మొండికేస్తున్నాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఎంతో సక్రమంగా నడిచిన 108 అంబులెన్స్‌లకు ప్రస్తుత ప్రభుత్వంలో ఆలనాపాలనా లేకుండా పోయింది. మంగళవారం సాయంత్రం 7.30 గంటల సమయంలో తంబళ్లపల్లె నుంచి పేషంట్ కోసం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి వచ్చిన ఏపీ-16, టీహెచ్-7750 అంబులెన్స్ 108 వాహనం స్టార్ట్ కాకుండా మొరాయించింది. దీంతో డ్రైవర్ అభ్యర్థన మేరకు ఆస్పత్రి ఆవరణలో ఉన్న రోగుల సహాయకులు బండిని ముందుకు, వెనక్కు చాలాసేపు, చాలాసార్లు తోయడంతో ఎట్టకేలకు స్టార్ట్ అయింది. హమ్మయ్య ఎలాగోలా వాహనం స్టార్ట్ అయిందనుకుంటే, దట్టమైన నల్లటి పొగను బయటకు వదులుతూ కాసేపటికి మళ్లీ నిలిచిపోయింది.

ఎస్పీని ఆశ్రయించిన ప్రేమజంట

రాయచోటి (జగదాంబసెంటర్) : మతాంతర వివాహం చేసుకున్న తమకు రక్షణ కల్పించాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడును ప్రేమజంట పి.మునీరా, కె.దేవేంద్ర శుక్రవారం విన్నవించారు. వారి కథనం మేరకు.. ఓబులవారిపల్లె మండలం చిన్నఓరంపాడు గ్రామానికి చెందిన పఠాన్ ఖలీల్ బాషా కుమార్తె పి.మునీరా.. రైల్వేకోడూరు మండలం జంగిటివారిపల్లి హరిజనవాడకు చెందిన చిన్నయ్య కుమారుడు దేవేంద్ర పరస్పరం ప్రేమించుకున్నారు. వీరికి మైనర్ తీరడంతో రైల్వేకోడూరులోని ఓ దేవాలయంలో మతాంతర వివాహం చేసుకున్నారు. కానీ వధువు తరపు బంధువులు దేవేంద్రను బెదిరిస్తుండటంతో జిల్లా ఎస్పీని కలిసి సమస్యను విన్నవించుకున్నారు. తమ ఇష్టపూర్వకంగా పెళ్లి చేసుకున్నట్లు మునీరా ఎస్పీకి వివరించారు.

ఇద్దరిపై పోక్సో కేసు నమోదు

సంబేపల్లె : మండల పరిధిలోని నాగిరెడ్డిగారిపల్లె పంచాయతీ అన్నప్పగారిపల్లెకు చెందిన విద్యార్థినిపై అఘాయిత్యానికి పాల్పడిన ఇద్దరిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. విద్యార్థి ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన యువకుడితో పాటు మరో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ భక్తవత్సలం తెలిపారు. ఈ మేరకు వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నామన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు

మదనపల్లె : ద్విచక్రవాహనం ఢీకొని మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం కురబలకోట మండలంలో జరిగింది. మదనపల్లెకు చెందిన సతీష్‌కుమార్ తన అత్త సరసమ్మ(45)ను తన స్వగ్రామమైన తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెలో వదిలిపెట్టి వచ్చేందుకు ద్విచక్రవాహనంలో మదనపల్లె నుంచి బయలుదేరాడు. మార్గమధ్యంలోని ముదివేడు సమీపంలో వెళుతుండగా, వెనుక వైపు నుంచి మరో ద్విచక్రవాహనం వేగంగా వచ్చి వీరిని ఢీకొని వెళ్లిపోయింది. ప్రమాదంలో సరసమ్మ తీవ్రంగా గాయపడగా, 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

కేజీబీవీల అభివృద్ధికి రూ.2.52 కోట్లు మంజూరు

రాయచోటి (జగదాంబసెంటర్) : రాయచోటి నియోజకవర్గంలోని కేజీబీవీల అభివృద్ధికి రూ.2.52 కోట్ల నిధులు మంజూరైనట్లు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలో పలు ప్రాంతాలలో మంత్రి పర్యటించిన సమయంలో కేజీబీవీ ఉపాధ్యాయులు, విద్యార్థులు తమ సమస్యలను మంత్రికి విన్నవించారు. దీంతో నియోజకవర్గంలోని ఆరు కేజీబీవీ పాఠశాలల్లో 11 పనులకు రూ.2.52 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.

టీడీపీ కార్యకర్తలు తిట్టారంటూ ఎస్పీకి ఫిర్యాదు

వీరబల్లి : మండలంలోని గుర్రప్పగారిపల్లి పంచాయతీ రైతు భరోసా కేంద్రంలో ఏహెచ్‌ఏగా విధులు నిర్వహిస్తున్న ఆది మౌనిక తనను ఆ గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు కులం పేరుతో దూషించారని ఎస్పీకి, జాయింట్ కలెక్టర్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. తమ సిబ్బందితో సమావేశం నిర్వహిస్తుండగా గుర్రప్పగారిపల్లి తెలుగుదేశం పార్టీ నాయకులు రామకృష్ణరాజు, అమరేశ్వరరాజు, సాయి, రాయుడు, గంగయ్య మరికొంత మంది నాయకులు అక్కడికి వచ్చి తాము చెప్పిన వారి పేరు మినీ గోకులం జాబితాలో ఎందుకు పెట్టలేదంటూ కులం పేరుతో దూషిస్తూ తనను కొట్టేందుకు వచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

జనసేన నాయకుడికి టీడీపీ నేత బెదిరింపులు!

– గ్రూపుల్లో వాయిస్ రికార్డు హల్‌చల్

సాక్షి టాస్క్‌ఫోర్స్ : అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గంలో జనసేన, టీడీపీ మధ్య విభేదాలు గుప్పుమంటున్నాయి. తాజాగా మంగళవారం రాజంపేట నియోజకవర్గం నందలూరు మండలం లేబాక గ్రామంలో జనసేన నాయకుడు మారటపల్లెకు చెందిన శివను అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఒకరు బెదిరించిన వాయిస్ రికార్డు బహిర్గతం కావడంతో జనసేన వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. జనసేన పార్టీలో చేరిక సభను లేబాక గ్రామంలో నిర్వహించారు. ఈ సభకు జనాన్ని సమీకరించే విషయంలో శివ కీలకంగా వ్యవహరించాడని ఆగ్రహంతో ఆ నాయకుడు ఊగిపోయాడు. లేబాక గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు జనసేన నాయకుడు శివకు ఫోన్ చేసి తమ సామాజిక వర్గాన్ని జనసేన సభకు ఎందుకు తీసుకెళ్లావంటూ ప్రశ్నించాడు. నీ భార్య ఆర్ఎంపీ కావచ్చు, నీవు ఇంజక్షన్ ఏ విధంగా వేస్తావని టీడీపీ నాయకుడు బెదిరించాడు. డీఎంహెచ్‌ఓకు ఫిర్యాదు చేస్తాను. నిన్ను ఎవడు కాపాడుతాడో చూద్దాం అంటూ గద్దించాడు. సాతుపల్లె మాదిగలతో కొట్టిస్తానని, ఎస్‌ఐకు చెప్పి కేసు పెట్టిస్తా, నీ అంతచూస్తా అంటూ బెదిరింపులకు దిగాడు. టీడీపీ నాయకుడు వ్యవహరించిన తీరుపై జనసేన వర్గాలు మండిపడుతున్నాయి.

పూజకు వెళ్లి కుందూ నదిలో వృద్ధురాలి మృతి

చాపాడు : మండల పరిధిలోని సీతారామాపురం సమీపంలో గల కుందూ నదిలో మంగళవారం పూజలు చేసుకునేందుకు వెళ్లి ప్రమాదశాత్తు నీటిలో గల్లంతై అల్లాడుపల్లెకు చెందిన నూకబోయిన సుబ్బమ్మ(70) అనే వృద్ధురాలు మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రొద్దుటూరులో నివాసం ఉంటున్న అల్లాడుపల్లెకు చెందిన సుబ్బమ్మ మంగళవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో కుందూనది వద్ద స్నానం చేసి పూజలు చేసుకునేందుకు వెళ్లింది. ఈ క్రమంలో ప్రమాదశాత్తు నీటిలో గల్లంతైంది. సుబ్బమ్మ ఎంత సేపటికీ ఇంటికి రాకపోవడంతో చెల్లెలి కుమారుడు మునీంద్ర సుబ్బమ్మ మొబైల్ నంబరుకు ఫోన్ చేయగా స్థానికులు ఫోనుతీసి సుబ్బమ్మ నదిలో పడిపోయినట్లు తెలిపారు. దీంతో మునీంద్ర నది వద్దకు వచ్చి పరిశీలించగా సుబ్బమ్మ మృతి చెంది ఉంది.